# సమస్యల వలయంలో అహ్మద్‌నగర్‌

రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్గంధం వెదజల్లుతున్న అహ్మద్‌నగర్‌ నాలా
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


అహ్మద్‌నగర్‌ శ్మశనవాటిక ఎగువ భాగంలో ఉన్న రోడ్డుపై వ్యర్థాలు


అధ్వానంగా అహ్మద్‌నగర్‌ నాలా

గోల్కొండ: అహ్మద్‌నగర్‌ డివిజన్‌లో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఓ వైపు పారిశుద్ధ్య పనులు కొరవడడం..మరో వైపు పూడికలకు నోచుకోని అహ్మద్‌నగర్‌ నాలా దుర్గంధాన్ని వెదజల్లుతూ ప్రజలకు నానా ఇబ్బందులకు గురి చేస్తుంది. నాలాలో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మాసబ్‌ట్యాంక్‌కు ఆనుకొని ఉన్న అహ్మద్‌నగర్‌లో ఏ బస్తీలో చూసినా సమస్యలే కానవస్తున్నాయి. చోటాబజార్‌, బడా బజార్‌, సయ్యద్‌నగర్‌ తదితర బస్తీలన్నీ సమస్యల వలయంలో చిక్కుకొని ఉన్నాయి. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు.

**అటకెక్కిన పారిశుద్ధ్య పనులు..**

అహ్మద్‌నగర్‌ మెయిన్‌ రోడ్లపై పారిశుద్ధ్య పనులు జరగడం లేదు. ఏ ఫుట్‌పాత్‌ చూసినా వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పడి ఉంటున్నాయి. రోజుల తరబడి అలాగే ఉంటున్న చెత్త కుప్పలు కుళ్లి దుర్గంధాన్ని వ్యాపింపజేస్తున్నాయి. వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్‌ చేసే వారు పార్కులను సైతం వదలడం లేదు. అహ్మద్‌నగర్‌ పార్కు చుట్టూ ఎప్పుడు చూసినా చెత్త కుప్పలే దర్శనం ఇస్తుంటాయి. మరో వైపు పార్కు సమీపంలో ఇళ్ల నిర్మించే వారు భవన నిర్మాణ సామగ్రిని పార్కు ఫెన్సింగ్‌ పొడవునా డంపింగ్‌ చేస్తున్నారు.

**శాపంగా మారిన నాలా..**

అహ్మద్‌నగర్‌ గుండా ప్రవహించే నాలా స్థానికులకు నానా రకాల ఇబ్బందులు కలుగజేస్తుంది. ఎన్నో చోట్ల ఈ నాలాకు ఉన్న ఫెన్సింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. నాలాకు ఉన్న ప్రహరీని కొందరు ఉద్దేశపూర్వకంగానే కూల్చివేశారని నాలా పరిసరాల్లో ఉండే వారు ఆరోపిస్తున్నారు. చెత్త రిక్షాలు, ఆటో ట్రాలీల్లో వ్యర్థాలను తెచ్చే వారు కూల్చివేసిన ప్రహరీ వద్ద నుంచి నాలాలో వ్యర్థాలను డంప్‌ చేస్తున్నారు. మరో వైపు మూడు నెలల క్రితం నాలాలో తూతూ మంత్రంగా పూడికలు తీసి వ్యర్థాలు నాలాకు ఆనుకోని ఉన్న రోడ్డుపైనే వేశారు. అహ్మద్‌నగర్‌ బస్టాప్‌ పక్క నుంచి వెళ్లే నాలా పాదచారులకు అత్యంత ప్రమాదకరంగా మారింది. నాలాపై నుంచి వేసిన రోడ్డు గుంతలమయంగా మారడంతో రోడ్డు ఎప్పుడు కూలిపోతుందో అని స్థానికులు భయపడుతున్నారు. ఏదేమైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అహ్మద్‌నగర్‌ డివిజన్‌లో సమస్యలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న కాజ వెంకట వసంత తదితరులు

అబిడ్స్‌: చెన్నకేశవ సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో సోమవారం గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ వద్ద హమాలీలు, కూలీలు, స్థానికుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా ట్రస్ట్‌ ప్రతినిధులు కాజ వెంకట వసంత, తులసి మాట్లాడుతూ..తమ సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ప్రతినెలా పేదలకు అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. దాదాపు 200 మందికి పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతి, సుధా, దివ్య, నాగరాజు, నేహ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


గోల్కొండలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్‌, టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా గుంతల రోడ్లు, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమైయ్యాయన్నారు. అదే విధంగా దెబ్బతిన్న డ్రైనేజీ లైన్‌లకు సైతం మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మజ్లిస్‌ నాయకులు ఆరూన్‌ఫరాన్‌, బేగ్‌, అలీముద్దీన్‌, సయ్యద్‌ ఆజామ్‌ తదితరులున్నారు.

## బహుమతుల ప్రదానం



విజయనగర్‌కాలనీ: మాస్టర్‌ ఒరేటర్‌ సీజన్‌–6 గ్రాండ్‌ ఫినాలేలో ఆసిఫ్‌నగర్‌ నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు రమా, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ప్రతిభ కనబరిచిన అలిజా, మేహరీన్‌ హబీబా, సులేమాన్‌, అదిఫా, ఉమైజాకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్‌ శశికళ, హైస్కూల్‌ కో ఆర్డినేటర్‌ శ్రీకాంత్‌, ప్రైమరీ స్కూల్‌ కో ఆర్డినేటర్‌ కె.ఫర్జానా, ఈ కిడ్స్‌ కో ఆర్డినేటర్‌ రష్మిక, దిల్షాద్‌ పాల్గొన్నారు.

## మహిళా పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులు మానుకోవాలి


డీసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కృష్ణానాయక్‌

చాంద్రాయణగుట్ట: జీహెచ్‌ఎంసీ మహిళా పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ హైదరాబాద్‌ సౌత్‌ జిల్లా కార్యదర్శి కృష్ణా నాయక్‌ కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ చాంద్రాయణగుట్ట సర్కిల్‌ ఉప కమిషనర్‌ సురేందర్‌ రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కొందరు సూపర్‌వైజర్లు మహిళలని చూడకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా పనులు చేయిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కార్మికులు కమిలీ, దర్శీ, సోనా, సంగీత, కృష్ణ, లక్ష్మీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఏడు తులాల బంగారు ఆభరణాలు మాయం

చాంద్రాయణగుట్ట: ఇంట్లోని అల్మారాలో దాచిన ఏడు తులాల బంగారు ఆభరణాలు మాయమైన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగుజూసింది. పోలీసుల వివరాల ప్రకారం..గౌలిపురాకు చెందిన ఆర్‌.రేణుక వారం రోజుల క్రితం అల్మారాలో ఏడు తులాల బంగారాన్ని దాచింది. నాలుగు రోజుల అనంతరం అల్మారాను తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. లాకర్‌లో దాచిన బంగారం మాత్రమే అలాగే ఉంది. ఈ విషయమై ఆమె ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సదర్‌కు రూ.25 కోట్ల నిధులు కేటాయించాలి


గడ్డం శ్రీనివాస్‌ యాదవ్‌

అబిడ్స్‌: సదర్‌ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించుకునే సదర్‌ ఉత్సవాలకు గతేడాది రూ.2 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని వెల్లడించారు. సదర్‌ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం, అందుకు అవసరమైన రూ.25 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. బోనాల పండుగ మాదిరిగా ప్రతి జిల్లాల్లో, మండల, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సదర్‌ ఉత్సవాలు, స్వాగత వేదికలను బట్టి నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఉత్సవ నిర్వాహకులకు అవసరమైన నిధులను చెక్కుల రూపంలో అందించాలని శ్రీనివాస్‌యాదవ్‌ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల నిర్వహణకు ముందుగానే ఉత్సవ నిర్వహణ ఖర్చులకు అవసరమైన నిధులను ప్రభుత్వం చెక్కులను పంపిణీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న నారాయణగూడలో యాదవులంతా నిర్వహించే సదర్‌ సమ్మేళనాన్ని వీక్షించేందుకు అమెరికా, థాయిలాండ్‌, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ దేశాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు గడ్డం శ్రీనివాస్‌ యాదవ్‌ తెలిపారు.

## విద్యారంగ వ్యాప్తికి విశేష కృషి


సమావేశంలో చైర్మన్‌ ప్రొఫెసర్‌ బాలకిష్టారెడ్డి, డాక్టర్‌ ప్రభాశంకర్‌

అబిడ్స్‌: విద్యారంగ వ్యాప్తికి ఎగ్జిబిషన్‌సొసైటీ విశేష కృషి చేస్తుందని తెలంగాణ స్టేట్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి.బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. 8 దశాబ్దాలకు పైగా తెలంగాణ నలుమూలలా ఎగ్జిబిషన్‌ సొసైటీ నిరంతరం ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అల్యూమిని, గోల్డెన్‌ జూబ్లీ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామ గ్రామల లక్షలాది మంది విద్యార్థులకు ఎగ్జిబిషన్‌ సొసైటీ విద్యనందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా తమకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంట్టుందన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా, ఉన్నత శ్రేణిలో ఉండేవిధంగా లక్షలాది మందిని తీర్చిదిద్దిన ఘనత ఎగ్జిబిషన్‌ సొసైటీదే అన్నారు. కేయూపీఏహెచ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ బి.ప్రభాశంకర్‌ మాట్లాడుతూ..తమ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## ‘గరికపూల చెలిమ కవి యాకూబ్‌’


మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో సోమవారం కవి యాకూబ్‌ సృజన సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ..మనుషుల జీవితం గురించి తన 40 ఏళ్ల కవిత్వ ప్రయాణంలో యాకూబ్‌ కలవరించాడన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ.. గరికపూల చెలిమ కవి యాకూబ్‌ అని, పాటగాడిగా ప్రారంభమై కవిగా పరివర్తన చెందడం ఎంతో అభినందనీయమన్నారు. ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సి.ఖాసీం మాట్లాడుతూ..కవి, విమర్శకుడు వేర్వేరు కాదని, విమర్శకుడైన కవే అసలైన కవిత్వాన్ని సృజిస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ ఏనుగు నర్సింహారెడ్డి, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్‌.బాలచారి, సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌ చంద్రయ్య, శివన్న, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్‌, సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకే జీవితం అంకితం


ధన్‌రాజ్‌ను సత్కరిస్తున్న సతీష్‌కుమార్‌, వినోద్‌ తదితరులు

అబిడ్స్‌: సమాజ సేవకే జీవితం అంకితమని ఖైరతాబాద్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ ఉపాధ్యక్షుడు, దళిత గ్రాడ్యుయేట్‌ ఫోరం గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు ఎస్‌.ధన్‌రాజ్‌ అన్నారు. గోషామహల్‌లోని తన కార్యాలయంలో ధన్‌రాజ్‌ను మాజీ డైరెక్టర్‌ సతీష్‌కుమార్‌, వినోద్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌ మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌లో కాంగ్రెస్‌ పార్టీదే విజయమన్నారు. నరేష్‌ పటేల్‌, ఆకాష్‌ సింగ్‌, యోగేష్‌ యాదవ్‌, బుగ్గ వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## అభినందనలు

జియాగూడ: కుల్సుంపురా ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సాయి శ్రీనివాస్‌యాదవ్‌ గ్రూప్‌–1లో సత్తాచాటి మున్సిపల్‌ కమిషనర్‌ గ్రేడ్‌–2 ఉద్యోగానికి ఎంపిక కావడం యూత్‌ ఆదర్శంగా తీసుకోవాలని జియాగూడ బీజేపీ సీనియర్‌ నాయకుడు వెంకటేష్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం రింగ్‌ రోడ్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి హాజరై పూల బొకే అందజేసి అభినందనించారు. అనంతరం వెంకటేష్‌యాదవ్‌ మాట్లాడుతూ..యువత పట్టుదలతో చదువుల్లో రాణించాలని కోరారు. రక్షిత్‌, అంకిత్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు



గోల్కొండ: దర్బార్‌ మైసమ్మ కృపతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటుందని కార్వాన్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మిత్రకృష్ణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం కార్వాన్‌లోని దర్బార్‌ మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం, పట్టు చీర సమర్పించారు. ఈ సందర్భంగా మిత్రకృష్ణ మాట్లాడుతూ..దర్బార్‌ మైసమ్మ కార్వాన్‌ ప్రజల ఆరాధ్య దేవత అన్నారు. పూజల్లో పరమేశ్వరిసింగ్‌, ఈ.అరుణ్‌కుమార్‌, మిత్ర అభిషేక్‌, విజయ్‌ముదిరాజ్‌, టీనాసింగ్‌, భిక్షపతి తదితరులున్నారు.

## తలసానికి ఆహ్వానం


తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్‌: ఈ నెల 20న జరిగే దీపావళి వేడుకలను పురస్కరించుకుని చార్మినార్‌ భాగ్యలక్ష్మి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించనున్నామని..ఈ పూజలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరుతూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆలయ ట్రస్టీ శశికళ ఆహ్వానపత్రం అందజేశారు. సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించినట్లు శశికళ తెలిపారు. ఆరు రోజుల పాటు దీపావళి వేడుకలను నిర్వహిస్తున్నామని..ఇందులో భాగంగా 20న జరిగే పూజల్లో పాల్గొనాలని తలసానిని కోరినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు మల్యాల మధుసూదన్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

## ‘జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ విజయం ఖాయం’

గోల్కొండ: జూబ్లీహిల్స్‌లో జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ షేక్‌పేట్‌ డివిజన్‌ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమర్థ పాలనలో పేద బడుగు వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లక్షలాది నిరుపేద కుటుంబాలకు లబ్ధిచేకూరిందన్నారు.

## ఐస్‌ స్కేటింగ్‌లో సత్తా చాటిన ప్రణవ్‌ మహదేవ్‌



గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్‌కు చెందిన యువ ఐస్‌ స్కేటింగ్‌ క్రీడాకారుడు ప్రణవ్‌ మహదేవ్‌ సూరపనేని జూనియర్‌ వరల్డ్‌ కప్‌ షార్ట్‌ ట్రాక్‌ ఐస్‌ స్కేటింగ్‌ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల కజకిస్థాన్‌లో జరిగిన పోటీలలో ఈ అర్హతను పొంది తెలంగాణ నుంచి మొట్టమొదటి కీడాకారుడిగా స్థానం సంపాదించుకున్నారు. సోమవారం ఇండోర్‌ స్టేడియంలో పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతదేశం తరపున ఒలింపిక్స్‌లో ఆడి పతకాలను తీసుకురావడమే తన జీవిత లక్ష్యమన్నారు. తెలంగాణ స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ కె.శివసేనారెడ్డి, కోచ్‌ ఎంఎ.ఖదీర్‌, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలుడిపై లైంగిక దాడికి యత్నం

చాంద్రాయణగుట్ట: మైనర్‌ బాలుడిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన పాతబస్తీ బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..క్యూబా కాలనీకి చెందిన 4వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలుడు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో స్థానికంగా ఉన్న కిరాణాదుకాణానికి టీ పొడి కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఇది గమనించిన ఓ యువకుడు బాలుడిని మాటల్లో దించి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలుడు కేకలు వేయడాన్ని గమనించిన స్థానికులు అక్కడికే వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం


మహ్మద్‌ జావీద్‌ (ఫైల్‌)

సంతోష్‌నగర్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచన్‌బాగ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్‌ జావీద్‌ (33), ఆఫ్రీన్‌ బేగం దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. మహ్మద్‌ జావీద్‌ సెంట్రింగ్‌ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దంపతుల మధ్య నెలకొన్న గొడవల కారణంగా ఈ నెల 2న జావీద్‌ ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 23 నుంచి బోడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు


ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయ ఆవరణలో ఈ నెల 23 నుంచి సర్వమంగళా దేవి సమేత శ్రీ మరకత మహా మంగళేశ్వర పంచాయతన పరివార దేవతా, బొడ్రాయి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు జె.మధుసూదన్‌గౌడ్‌ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు వేదాంతం రాజ నర్సింహాచార్యులు, పవన్‌ కుమార్‌ ఆచార్యుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల వాల్‌ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 23న ఉప్పుగూడ పొలిమెరలో దేవతా మూర్తుల ఊరేగింపు, బలిహరణ, 24న అఖండ దీప స్థాపన, అంకురారోపణ, ప్రధాన కలశ స్థాపన, 25న యంత్ర విగ్రహములకు నవవిధ ద్రవ్య మహా జలాభిషేకం, స్థాపిత దేవతార్చనలు ఉంటాయన్నారు. 26న ఉదయం 11.27 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కళాన్యాసనం, బొడ్రాయికి ఆడపడుచుల నీటితో అభిషేకం చేయడం, 27న గ్రామస్తులు వారి వారి గృహాల్లో ఒడిబియ్యం సమర్పణ చేసుకోవాలని, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం జరుపబడుతుందని తెలిపారు. 28న బొడ్రాయి పండుగ, గ్రామస్తులంతా నివాసాల నుంచి బోనాలు సమర్పించే కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సుభాష్‌, కార్యదర్శులు సతీష్‌, శ్రీనివాస్‌, గురునాథ్‌, హరికృష్ణ, భవానీశంకర్‌, వేణు, సాయి, కిరణ్‌ పాల్గొన్నారు.

## సైబర్‌ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న టోలిచౌకీ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌

గోల్కొండ: గోల్కొండ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండ షాలీమార్‌ ఫంక్షన్‌హాల్‌లో సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టోలిచౌకీ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ పోలీసులు సైబర్‌ నేరాల నుంచి దూరంగా ఉంచడానికి స్టే సేఫ్‌ ఆన్‌లైన్‌ క్యాంపెయిన్‌ ప్రారంభించారని దీనికి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సైబర్‌ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కుకోకుండా స్టే సేఫ్‌ ఆన్‌లైన్‌ అత్యుత్తమమైనదన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు వీడియోలు, నిజంపై ఆధారపడిన వీడియో క్లిపింగ్స్‌ను ప్రదర్శించారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ బి.సైదులు, పీస్‌ కమిటీ సభ్యులు ఆజామ్‌ఖాన్‌ తదితరులున్నారు.

## ‘తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదు’


కాంగ్రెస్‌ నాయకులతో యూత్‌ కాంగ్రెస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి రోశిని జైస్వాల్‌

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీకి తిరుగులేదని యూత్‌ కాంగ్రెస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి రోశిని జైస్వాల్‌ అన్నారు. సోమవారం ఆమె షేక్‌పేట్‌లో కాంగ్రెస్‌ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నారన్నారు. మహిళల కోసం తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని ఆమె అన్నారు. యూత్‌ కాంగ్రెస్‌ జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం అధ్యక్షుడు ఖాలేద్‌, షేక్‌పేట్‌ డివిజన్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు రఘునందన్‌, బాలకృష్ణ, సాయినాథ్‌, మురళీకృష్ణ తదితరులున్నారు.

## ముగిసిన ఓపెన్‌ పికిల్‌బాల్‌ టోర్నమెంట్‌


విజేతలకు బహుమతులను అందజేస్తున్న శ్రీనివాస్‌ బాబు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్‌ పికిల్‌ బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఇండోర్‌ స్టేడియంలో నిర్వహిస్తున్న ఓపెన్‌ పికిల్‌బాల్‌ టోర్నమెంట్‌ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ..పికిల్‌బాల్‌కు మంచి ఆదరణ లభిస్తుందని ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా కేంద్రాలలోనూ ఈ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో మిక్సడ్‌ డబుల్స్‌ ఫైనల్‌లో శర్వాణి చింతపల్లి, అనంత మణి ముని జోడి 11–10, 11–10తో సృష్టి చౌదరి, గోపీరెడ్డిపై వరుస సెట్లలో మెరుపు విజయం సాధించి విజేతలుగా నిలిచారు. అదే విధంగా పురుషుల సింగిల్స్‌ విభాగంలో వైశాక్‌ వీఎస్‌, డబుల్స్‌ విభాగంలో గిరీష్‌, విజయ్‌తేజ్‌లు విజయం సాధించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఏ ప్రతినిధులు సుమిరన్‌ కొమ్మరాజు, శ్రీధర్‌, నిర్వాహకులు కార్తీక్‌, సత్యదీప్‌, మహేష్‌, కిశోర్‌ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో వీసీ ఆచార్య సూర్య ధనుంజయ, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ లోకపావని, విద్యార్థులు

సుల్తాన్‌బజార్‌: వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలోని హ్యూమన్‌ క్యాపిటల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విశ్వవిద్యాలయ వైస్‌ చాన్స్‌లర్‌ ఆచార్య సూర్య ధనుంజయ, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ లోకపావని, యాంటీడ్రగ్‌ కమిటీ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ మాధురి ఠాగూర్‌ కళాశాల, ఇతర అధ్యాపక బృందంతో పాటు యూతీ, పీజీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ..మాదక ద్రవ్య రహితంగా తమ కళాశాల, తమ రాష్ట్రం, దేశం మారాలని అదేవిధంగా విద్యార్థుల కృషి ఉండాలన్నారు. సుల్తాన్‌బజార్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.నరసింహ మాట్లాడుతూ..యాంటీ డ్రగ్‌ అవేర్నెస్‌ విషయాలను విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు.